సాక్షి
కామారెడ్డి
బుధవారం । 24 । మే । 2023



పోటీపరీక్షలకు ఉపయుక్తం

సామాజిక ఆర్థిక ముఖచిత్రం పుస్తకం పోటీపరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఉపయోగపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

- 9లో ▸



లక్ష్యం దిశగా ఆయిల్‌పామ్ సాగు

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా ఉద్యాన శాఖ అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
40.7 /27.5

వాతావరణం

ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఎండతీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉం టుంది. వడగాలులు వీస్తాయి. సాయంత్రం వేళ వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలి



కామారెడ్డి క్రైం : జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడా పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడాకారులు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. నేటి ఓటమి రేపటి గెలుపునకు నాంది పలుకుతుందన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం సీనియర్ సిటిజన్ ఫోరంలో టేబుల్ టెన్నిస్ క్రీడలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రసూల్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నిధులున్నాయ్.. పనులు చేయండి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



భిక్కనూరు : ప్రభుత్వం ఆస్పత్రుల అభివృద్ధికి నిధులు సిద్ధంగా ఉన్నాయని కాంట్రాక్టర్లు పనులు చేయడమే ఆలస్యమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం భిక్కనూరు మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఆస్పత్రుల అభివృద్ధి కోసం డబ్బులు ఖజానాలో సిద్ధంగా ఉన్నాయని కాంట్రాక్టర్లు పనులు చేయడం పూర్తయితే బిల్లులు వెంటనే చెల్లిస్తామన్నారు. పనులను నాణ్యతగా చేపట్టాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ఎంపీడీవో అనంత్ రావు, ఎంపీవో ప్రవీణ్‌కుమార్, వైద్యురాలు యెమిమా, ఎంపీపీ గాలిరెడ్డి, జెడ్పీటీసీ పద్మ నాగభూషణంగౌడ్ ఉన్నారు.

శానిటేషన్ పనులు పూర్తి కావాలి..

రాజంపేట : రాజంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శానిటేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ఆదేశించారు. మంగళవారం రాజంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన సందర్శించారు. ఆస్పత్రిలో చేపడుతున్న శానిటేషన్ పనులపై ఆరా తీశారు. అనంతరం గర్భిణులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న న్యూట్రిషన్ కిట్లను గర్భిణులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, తహసీల్దార్ శాంత, ఎంపీడీవో బాలకిషన్, సర్పంచ్ సౌమ్యనాగరాజు పాల్గొన్నారు.

29న 'పీఎఫ్ నిధి ఆప్కే నికట్'

నిజామాబాద్ సిటీ: పీఎఫ్ కార్యాలయం ఆధ్వర్యంలో మల్లారం, బాన్సువాడ పట్టణాలలో నిధి ఆప్కే నికట్ 2.0(మీ ఇంటివద్దకు ఈపీఎఫ్ఓ) కార్యక్రమాన్ని ఈ నెల 29న నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ సహాయక కమిషనర్ బి మధుసూదనాచారి ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ రూరల్ మండలం మల్లారంలో గల దేశాయ్ బ్రదర్స్ లిమిటెడ్‌లో పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ వి శ్రవణ్ కుమార్, బాన్సువాడ పట్టణం మున్సిపల్ కౌన్సిల్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎస్ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో నిధి ఆప్కే నికత్ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. పీఎఫ్ చందాదారులు, యజమానులు, పెన్షనర్లు తగిన ఆధారాలతో నిధి ఆప్కే నికత్ 2.0 హాజరు కావాలని, ఫిర్యాదులను విని అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. ఈ ప్రోగ్రామ్‌లో పాల్గొనాలనుకునేవారు ro.nizamabad@epfindia.gov.in అనే ఈ మెయిలు అడ్రస్ ద్వారా, లేదా, ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ నిజామాబాద్‌లో ముందుగా సమర్పించిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కారం అవుతాయని సహాయక కమిషనర్ తెలిపారు.

కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపిన జేపీఎస్‌లు

కామారెడ్డి టౌన్ : జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించడంతో మంగళవారం జిల్లా పంచాయతీ కార్యదర్శులు కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను కలిసారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల జేపీఎస్‌లు పాల్గొన్నారు.

తీపి పంట చేదైంది..!

- నల్లబెల్లం పేరుతో ఆంక్షలు
- స్వరాష్ట్రంలో నిలిచిపోయిన బెల్లం తయారీ
- జిల్లాలో కరువైన ఇంటి బెల్లం
- ఇతర పంటలవైపు మరలుతున్న రైతులు

▪ భిక్కనూరు మండలం తిప్పాపూర్ గ్రామానికి చెందిన రైతు వంగేటి నర్సారెడ్డి అరవై ఎకరాల్లో చెరకు పంట సాగు చేసి బెల్లం వండేవారు. ఆయన చెరకు పంటను, బెల్లం తయారీని చూడడానికి ఎక్కడెక్కడి నుంచో రైతులు వచ్చి చూసి మెళకువలు తెలుసుకునేవారు. అయితే తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత బెల్లం తయారీపై ఆంక్షలు విధించడంతో బెల్లం తయారీ మానుకుని చెరకును ఫ్యాక్టరీకి తరలించాడు. చెరకు నరకడం, తరలించడంలో అనేక ఇబ్బందులు ఎదురయ్యేవి. ఏడాది కష్టానికి తగిన ఫలితం రావడం లేదని రెండేళ్లుగా చెరకు పంట నుంచి తప్పుకున్నాడు. బెల్లం వండినపుడే నాలుగు డబ్బులు కనిపించేవని నర్సారెడ్డి పేర్కొంటున్నాడు. చెరకు స్థానంలో ఇతర పంటలు సాగు చేస్తున్నాడు.





బెల్లం వండుతున్న రైతులు (ఫైల్)

సాక్షి, కామారెడ్డి : చెరకు రైతుకు మార్కెట్‌లో ఎంతో డిమాండ్ ఉండేది. చేనులో చెరకు పంట ఉందంటే చాలు బ్యాంకులో డబ్బులు ఉన్నట్టే. బిడ్డ పెళ్లి చేయాలన్నా, ఇళ్లు కట్టుకుందామన్నా, ఇంత భూమి కొనాలన్నా చెరకు రైతుకు షావుకార్లు పిలిచి మరీ అప్పులు ఇచ్చేవారు. అంటే చెరకు పండించే రైతుకు మార్కెట్‌లో అంత విలువ ఉండేది. బెల్లంతో నాలుగు పైసలు మిగిలేవి. రైతు కూడా ధైర్యంగా ఉండేవాడు. ఇదంతా గతం. ఇప్పుడు పరిస్థితులన్నీ తలకిందులయ్యాయి. తరతరాలుగా బెల్లం తయారు చేస్తూ వచ్చిన రైతులు ప్రభుత్వాల ఆంక్షలతో బెల్లం తయారీని మానుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు సీఎం ఉన్నప్పుడు బెల్లంపై ఆంక్షలు విధించి రైతులను ఇబ్బందుల పాలు చేశాడు. బెల్లం రైతులు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తే వారిని జైళ్లకు కూడా పంపించారు. అయితే దివంగత సీఎం వైఎస్సార్ అధికారంలోకి వచ్చాక బెల్లంపై ఆంక్షలను ఎత్తివేసి ప్రోత్సహించడంతో బెల్లం తయారీ పెరిగింది. అయితే స్వరాష్ట్రంలోనూ బెల్లంపై ఆంక్షలు విధించారు. బెల్లం వండితే జైలుకే పంపుతామంటూ ఎక్సైజ్ యంత్రాంగం అప్పట్లో ఊరూరా ప్రచారం చేపట్టింది. దీంతో రైతులు బెల్లం తయారీని మానుకున్నారు. ఉన్న చెరకు పంటను ఫ్యాక్టరీలకు పంపి చెరకు పంటకు దండం పెట్టారు. గడచిన ఏడెనిమిదేళ్లుగా బెల్లం తయారీ లేకుండాపోయింది. బెల్లం లేకపోవడంతో రైతులు చెరకు సాగుకు దూరమై ఇతర పంటల వైపు మరలిపోయారు. ఇంకా మిగిలిన కొద్దిమంది చెరకు రైతులు కూడా తీపి పంటను వదిలేస్తున్నారు.

ఏడాది	బెల్లం కొనుగోలు (క్వింటాళ్లలో)
2005-06	6,983
2006-07	31,622
2007-08	43,632
2008-09	20,501
2009-10	26,214
2010-11	33,947
2011-12	33,901
2012-13	33,281
2013-14	31,942
2014-15	32,858
2015-16	19,034

గాంధీ గంజ్ బెల్లానికి పెట్టింది పేరు..!

జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణంలోని గాంధీ గంజ్ బెల్లం వ్యాపారానికి పెట్టింది పేరు. ఇక్కడి వ్యాపారులు రూ. కోట్లల్లో బెల్లం దందా చేసేవారు. కామారెడ్డి మార్కెట్ నుంచి గుజరాత్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు బెల్లం తరలిపోయేది. కామారెడ్డి ప్రాంతంలో ఎక్కువగా తిప్పాపూర్, రామేశ్వర్‌పల్లి, ఆరెపల్లి, ర్యాగట్లపల్లి, బస్వాపూర్, దోమకొండ, అంబారీపేట, బండరామేశ్వర్‌పల్లి, మోతె, లచ్చాపేట, మాందాపూర్ తదితర గ్రామాల్లో పెద్ద ఎత్తున బెల్లం తయారు చేసేవారు. వేలాది ఎకరకాల్లో చెరకు పంట సాగయ్యేది. ఒక్కో ఏడాది మార్కెట్‌కు 30 వేల క్వింటాళ్ల నుంచి 40 వేల క్వింటాళ్ల దాకా బెల్లం తరలివచ్చేది. బయటి మార్కెట్‌లో అంతకు రెట్టింపు బెల్లం అమ్ముకునేవారు. అయితే బెల్లంపై ఆంక్షలు విధించిన తరువాత కామారెడ్డి గాంధీ గంజ్ రూపమే మారిపోయింది. అక్కడ బెల్లం సువాసనలు లేవు. బెల్లం ముద్దలు నిల్వ ఉండాల్సిన దుకాణాలన్నీ బోసిపోయాయి.

పొరుగు బెల్లమే దిక్కాయే..

అప్పట్లో ఊరూరా ఏ పొలం దగ్గరకు వెళ్లినా బెల్లం ఉడికిస్తూ కుటుంబాలన్నీ పొలాల దగ్గరే గడిపేవి. బెల్లం వండిన రైతులు బెల్లం ముద్దలను బంధువులు, స్నేహితులకు పంపించేవారు. ఉగాది పచ్చడితో పాటు ఇతర అవసరాలకు చాలా కుటుంబాలు బెల్లం వాడుతాయి. అలాంటిది తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత బెల్లంపై విధించిన ఆంక్షల మూలంగా స్థానికంగా బెల్లం తయారీ నిలిచిపోయి అందరూ ఆంధ్ర నుంచి వచ్చే బెల్లం కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. మార్కెట్‌లో బెల్లం కిలోకు రూ.55 నుంచి రూ.72 దాకా అమ్ముతున్నారు. గతంలో బెల్లం వండిన రైతులు కూడా ఇప్పుడు తమ అవసరాల కోసం కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. రక్తహీనతతో ఇబ్బంది పడుతున్న కిషోర బాలికలు, గర్భిణీలకు బెల్లంతో కూడిన పల్లి, నువ్వుల పట్టీలు తినిపించమని వైద్యులు సలహాలు ఇస్తుంటారు. అందుబాటులో బెల్లం లేకపోవడం, కొనాలంటే ధరలు అందుబాటులో లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. మన దగ్గర ప్రభుత్వం బెల్లంపై విధించిన ఆంక్షలను ఎత్తివేసి, రైతులను ప్రోత్సహిస్తే అటు రైతులకు, ఇటు ప్రజలకు మేలు కలుగనుంది.

బల్దియా స్థలాలను

కాపాడండి

- అధికారులకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఆదేశం
- 'సాక్షి' కథనానికి స్పందన
- చర్చనీయాంశంగా, మారిన కథనం

సాక్షి ఎఫెక్ట్..

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి పట్టణంలోని మున్సిపల్ ఓపెన్ స్థలాలు ఆక్రమణలు, కబ్జాలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన మున్సిపల్ స్థలాలకు సంబంధించి 'కబ్జా చెయ్..బోర్డు పాతెయ్' కథనానికి స్పందించారు. ఓపెన్ స్థలాలకు కంచెలను ఏర్పాటు చేసి బోర్డు పాతాలని అధికారులకు సూచించారు. సాక్షిలో వచ్చిన ఈ కథనానికి బల్దియాలో, కౌన్సిలర్లలో చర్చనీయాంశంగా మారి కలకలం రేపింది. కబ్జాలో భాగస్వాములుగా ఉన్న కొందరు కౌన్సిలర్‌లు ప్రత్యేకంగా సమావేశం పెట్టుకుని చర్చించుకున్నారని సమాచారం. మరి కొందరు కౌన్సిలర్లు ఈ స్థలాలను కాపాడేందుకు కౌన్సిల్‌లో చర్చించాలని మాట్లాడుకున్నారు.

వెల్‌డన్ ఉమా హారతి

- అభినందించిన హైదరాబాద్ సిటీ కమిషనర్ సీవీ ఆనంద్

సాక్షి, కామారెడ్డి : సివిల్ సర్వీసెస్ లో మూడో ర్యాంక్ సాధించిన పోలీస్ అధికారి నూకల వెంకటేశ్వర్లు కూతురు ఉమా హారతిని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ట్విట్టర్ ద్వారా అభినందించారు. తాను ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎస్పీగా 1996–99లో పనిచేసినప్పుడు వెంకటేశ్వర్లు కామారెడ్డి టౌన్ ఎస్సైగా పనిచేశాడని, అప్పట్లో నక్సల్స్‌ను అణిచివేయడంలో విరోచితంగా పోరాడి ప్రశంసలు పొందారన్నారు. ప్రస్తుతం వెంకటేశ్వర్లు నారాయణపేట జిల్లా ఎస్పీగా పనిచేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఉమా హారతిని, ఆమె తండ్రి వెంకటేశ్వర్లునకు సీవీ ఆనంద్ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

జాతీయ రహదారిపై రైతుల ధర్నా



ధర్నా చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న జుక్కల్ తహసీల్దార్ గణేశ్

- గన్నీబస్తాలు, లారీల కోసం ఆందోళన
- సముదాయించిన అధికారులు

నిజాంసాగర్(జుక్కల్): వరిధాన్యం తూకాలకు గన్నీ బస్తాల్లేవని, లారీలు కూడా రావట్లేదని పేర్కొంటూ మంగళవారం జుక్కల్ చౌరస్తాలో సంగారెడ్డి–నాందేడ్ జాతీయ రహదారిపై రైతులు ధర్నా చేశారు. ఖండెబల్లూర్, కల్లాలి, కౌలాస్, మహమ్మదాబాద్ గ్రామాల రైతులతో కలిసి వైఎస్సార్‌టీపీ నాయకుడు బోర్గి సంజీవ్ ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకాలకు, సొసైటీ సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు మండిపడ్డారు. జాతీయ రహదారిపై రైతులు ఆందోళన చేస్తూ ధర్నాకు దిగడంతో వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ సమస్యల ఏర్పడింది. విషయం తెలుసుకున్న జుక్కల్ తహసీల్దార్ గణేశ్, ఎస్సై మురళి రైతుల వద్దకు చేరుకొని వారితో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు లారీలను పంపిస్తామని, గన్నీ బస్తాలను స రఫరా చేస్తామని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. అధికారులు, పోలీసులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళనను విరమించారు.

ఈ విషయమై జుక్కల్ సొసైటీ సీఈవో బాబురావ్‌ను సాక్షి ఫోన్‌లో సంప్రదించగా నాలుగైదు రోజులుగా లారీలు రావట్లేదని, నాలుగు కేంద్రాల్లో 8,500 ధాన్యం బస్తాలకు పైగా నిల్వ ఉన్నాయన్నారు. లారీల కొరత తీవ్రంగా వేధిస్తోందని ఆయన పేర్కొన్నారు. రైతులు ధర్నాకు దిగడంతో ఆర్టీవో అధికారులు నాలుగు లారీలను పంపడంతో ధాన్యం బస్తాలను తరలించామన్నారు.

అనుమానాస్పద స్థితిలో సర్పంచ్ భర్త మృతి

- ఆత్మహత్యగా భావిస్తున్న పోలీసులు
- హత్య చేశారంటున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

కామారెడ్డి క్రైం : రామారెడ్డి మండలం సింగరాయపల్లి సర్పంచ్ భర్త, సీనియర్ నాయకుడు అధికం నర్సాగౌడ్ (48) అనుమానాస్పదంగా మృతి చెందారు. సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన మంగళవారం ఉదయం జిల్లా పోలీస్ కార్యాలయానికి కూత వేటు దూరంలోని ఓ నిర్మానుష్య ప్రదేశంలో మృతదేహమై కనిపించాడు. గ్రామానికి చెందిన నర్సాగౌడ్ గతంలో రెండుసార్లు ఎంపీటీసీగా, ఓసారి వైస్ ఎంపీపీగా పని చేశారు. కొద్దికాలం అప్పటి ఉమ్మడి మాచారెడ్డి మండలానికి ఇన్‌చార్జి ఎంపీపీగానూ కొనసాగారు. కామారెడ్డిలోని అశోక్‌నగర్ కాలనీలో నివాసం ఉంటూ హోటల్ వ్యాపారం చేసేవారు. ఆయన భార్య మహేశ్వరి ప్రస్తుతం సింగరాయపల్లి సర్పంచ్‌గా ఉన్నారు.

22న పాల్వంచ మండల ఏర్పాటు సభలో పాల్గొన్న నర్సాగౌడ్ సాయంత్రం ఇంటికి వచ్చి 7.30కు బయటకు వెళ్లి తిరిగి రాలేదని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. రాత్రి ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ వచ్చిందన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయానికి కొద్ది దూరంలో పాత భవన నిర్మాణం వెనక నర్సాగౌడ్ మృతదేహం ఉన్నట్లు ఉదయం 10 గంటలకు గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చా రు. డీఎస్పీ సురేష్, రూరల్ సీఐ శ్రీనివాస్, దేవునిపల్లి ఎస్సై ప్రసాద్‌లు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మద్యంలో విషం కలుపుకొని ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తుండగా ఆయనకు ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం లేదని, హత్యచేసి ఉంటారని, చేతులు, ముఖంపై గాయాలున్నాయని బంధువులు అనుమానిస్తున్నారు.



సంఘటనా స్థలంలో నర్సాగౌడ్ మృతదేహం



నర్సాగౌడ్ (ఫైల్)

మృతదేహంతో ఆందోళన

రామారెడ్డి : సింగరాయపల్లి సర్పంచ్ అధికం మహేశ్వరి భర్త అధికం నర్సాగౌడ్ మృతికి గ్రామానికి చెందిన చెన్నం నరసింహారెడ్డితో పాటు మరో ఐదురుగు కారణమని ఆరోపిస్తూ గ్రామస్తులు మృతదేహంతో చెన్నం నరసింహారెడ్డి ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. ముందే విషయాన్ని గ్రహించిన నరసింహారెడ్డి కుటుంబీకులు ఇంటికి తాళం వేసి పరారయ్యారు. ఘటనా స్థలానికి కామారెడ్డి డీఎస్పీ సురేశ్, రూరల్ సీఐ శ్రీనివాస్ గౌడ్, రామారెడ్డి ఎస్సై అనిల్ చేరుకుని నిందితులను శిక్ష పడేలా చూస్తామని చెప్పి మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలించారు. అంతకుముందు కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పరామర్శించారు.



చెన్నం నరసింహారెడ్డి ఇంటి ముందు మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు

వారం క్రితం గ్రామ సభలో..

వారం క్రితం గ్రామసభలో జీపీ నిధుల వినియోగం, బెల్టుషాప్ వేలం విషయంలో సర్పంచ్ భర్తను కొందరు ప్రశ్నించినట్లు తెలిసింది. అయితే తన ప్రతిష్టకు భంగం కలిగేలా వాట్సప్ గ్రూప్‌లలో పోస్టింగ్‌లు పెట్టారని నర్సాగౌడ్ ఇటీవల కొందరిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఓ ముగ్గురు వ్యక్తులను పిలిపించి విచారించారు. నర్సారెడ్డికి ఆ ర్థిక ఇబ్బందులున్నట్లు మరికొందరు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు న్నారు. భార్య ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పౌల్ట్రీ రైతు విలవిల

- ఎండవేడికి మృత్యువాత పడుతున్న కోళ్లు
- వాటిని బతికించేందుకు తడిసి మోపెడవుతున్న ఖర్చు
- ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పౌల్ట్రీరైతులు

ఎండాకాలం.. కోళ్లపాలిట మృత్యుకాలంగా మారుతోంది. తీవ్రమైన వేడి.. 'పౌల్ట్రీ'పై ప్రభావం చూపుతుంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో కోళ్లలో వ్యాధి నిరోధక శక్తి సన్నగిల్లుతుంది. దీంతో వీటిని కాపాడుకునేందుకు పౌల్ట్రీ రైతు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. ఫలితంగా వ్యవసాయ అనుబంధ రంగాల్లో కీలకపాత్ర పోషించే కోళ్ల పరిశ్రమ కుదేలవుతుంది.



బీబీపేట : పౌల్ట్రీ రంగంపై ఆధారపడిన రైతులను ఎండాకాలం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. కోళ్లను నమ్ముకున్న ఫాం రైతులకు తీరని నష్టం వాటిల్లుతోంది. మండే ఎండల నుంచి వాటిని కాపాడుకునేందుకు ఖర్చు పెరిగిపోతుండడంతో పౌల్ట్రీ రైతులు ఆగమాగమైతున్నారు. కోడి పిల్లలు నుంచి 45రోజుల పాటు వాటిని బతికించి అమ్మేవరకు వాటిని సంరక్షించినప్పటికీ ధర సరిగ్గా రాక రైతులు నష్టాలపాలడుతున్నారు.

గోనె సంచులు, గడ్డితో..

మండే ఎండల నుంచి కోళ్లను కాపాడేందుకు కోళ్ల ఫారం పైన ఎండు గడ్డి, తుంగ లాంటిది వేసి కప్పుతున్నారు. అంతే కాకుండా ఫారం చుట్టూ గోనె సంచులు కట్టి వాటిపై ఎప్పటికప్పుడు నీళ్లు చల్లుతున్నారు. ఫారంపైన స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసి పైన వేసిన గడ్డి తడిసేలా ప్రతి గంటకు ఒకసారి నీళ్లను చల్లిస్తున్నారు. అంతే కాకుండా రోజు ఉదయం నుండి సాయంత్రం ప్రతి రెండు గంటలకు ఒకసారి స్ప్రే పంపులతో కోళ్లపై స్ప్రే చేస్తేనే అవి ఉపశమనం పొందుతున్నాయి. అయినప్పటికీ వేడిగాలుల కారణంగా చాలావరకు కోళ్లు మృత్యువాత పడుతున్నాయి.

జిల్లావ్యాప్తంగా

జిల్లావ్యాప్తంగా సుమారు 32లక్షల బాయిలర్ కోళ్లు ఉండగా, 6లక్షలకు పైగా లేయర్ కోళ్లు ఫారాల్లో వివిధ దశల్లో ఉన్నాయి. ఒక కోడి పెంచి మార్కెట్‌కు తరలించాలంటే సుమారు ఫారంలో 45రోజులు పెంచాల్సి వస్తుంది. అయితే ఇతర రోజుల్లో కాకుండా ఎండాకాలంలో మాత్రం పౌల్ట్రీరైతులతో అదనపు భారం పడుతోంది. సుమారు 5 వేలు ఉన్న కోళ్ల ఫారం పైన ఎండు గడ్డి వేయాలంటే ఒక్కో గడ్డి కట్టడానికి ట్రాక్టర్‌కు రూ. 30 చెల్లిస్తే ఫారం మొత్తానికి 30 గడ్డి కట్టలు వేయాల్సిన అవసరం ఏర్పడుతుంది. 30 గడ్డి కట్టలకు రూ. 900 ఖర్చు అవుతుంది. గడ్డి కొనుక్కు రావాలంటే ఒక్కో గడ్డి కట్టకు రూ. 40 వరకు తీసుకుంటున్నారు. మొత్తం కలిపితే రూ.1,200 ఖర్చు అవుతుంది. దానిని పైన వేసి కప్పాలంటే రెండు రోజుల పాటు నలుగురు కూలీలు అవసరమవుతుంది. ఇలా ఒక్కో ఫారం మీదికి సుమారు రూ. 10 వేల వరకు ఖర్చు అవుతుంది. అంతే కాకుండా స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసుకోవాలంటే సుమారు 5 వేల కోళ్లు ఉన్న ఫారానికి రూ. 7 వేల ఖర్చు అవుతుంది. ఫారం లోపల కూడా అనునిత్యం చల్లగా ఉండేలా ఫాగర్స్ కూడా ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది.

ఇంత చేసినా లాభాల్లేవు..

పౌల్ట్రీ రంగంలోకి కార్పొరేట్ శక్తులు రావడమే కాకుండా కోడి ధరలు అమాంతం పడిపోతున్నాయి. షెడ్‌లో 6 వేల కోళ్లను పెంచడానికి రూ. 12 లక్షలు పెట్టుబడి అవసరం. కోడిపిల్లను రూ. 25 నుంచి 30 వరకు కొనుగోలు చేస్తారు. మొక్కజొన్న ధరలు, సోయాబీన్ ధరలు తగ్గినా దానా ధర మాత్రం తగ్గడం లేదు. అంతే కాకుండా కోడి పిల్ల దశ నుంచి అమ్మే వరకు 45 రోజుల్లో మూడున్నర కిలోల దాణా ఆహారంగా తీసుకుంటుంది. అంటే దాదాపు రూ. 180 వరకు ఆహారం తీసుకుంటుంది. ఉనుక, వైద్యం, విద్యుత్, పనిచేసేవాళ్లతో కలిపి ఒక్కో కోడి పెంపకానికి రూ. 200 పైగా వెచ్చించాల్సి వస్తోంది. ఇక కోళ్లను విక్రయించే సమయంలో పేపర్ రేట్ శుక్రవారం రూ. 125 ఉండగా మైనస్ రూ. 10 నుంచి 15 వరకు అంటే రూ. 110కు విక్రయిస్తున్నారు. అయితే పౌల్ట్రీ రైతులకు తప్ప ట్రేటర్లకు, చికెన్ సెంటర్లకు మాత్రం లాభం చేకూరుతుంది.



కోళ్ల ఫారం పైన కప్పిన ఎండు గడ్డి



ఎండవేడి తట్టుకోలేక చనిపోయిన కోళ్లు

ఎండాకాలం కష్టాలే ఎక్కువ



మండే ఎండల్లో కోళ్లను కాపాడుకోవడానికి అవస్థలు పడా ల్సి వస్తుంది. ఒకవేళ కోళ్లు దింపుకోకపోతే ఏం చేయా లో తోచడం లేదు. ఎండాకాలంలో వేడి నుండి కోళ్లను రక్షించుకోవడానికి ఎండు గడ్డి, ఫాగర్స్, స్ప్రింక్లర్స్ లాంటివి ఏర్పాటు చేసుకోవడంతో పాటు ఇద్దరు కూలీలు ఏర్పాటు చేసుకోవాలి. ఎండ వేడికి ఫారం మొత్తం చల్లబడేలా నీటితో తడుపుతూ కోళ్లను ఉంచాలి. అలాంటప్పుడే కోళ్లు చనిపోకుండా ఉంటా యి. ఇంత చేసినా నష్టాలు వస్తున్నాయి. ప్రభుత్వం కోళ్ల ఫారాల రైతులకు తగిన విధంగా ప్రోత్సాహా న్ని అందించాలి.

– రాజయ్య, కోళ్ల ఫారం రైతు, బీబీపేట



క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

గాంధారి(ఎల్లారెడ్డి)/ఇందల్వాయి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఇందల్వాయి(బాలికలు) గిరిజన ఏకలవ్య గురుకుల కళాశాల, గాంధారి(బాలురు) గిరిజన ఏకలవ్య గురుకుల కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో ఖాళీ సీట్ల భర్తీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ అమర్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న గాంధారిలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఈ రెండు కాలేజీల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో కొన్ని సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. ఇందల్వాయి బాలికల కాలేజీలో ఎంపీసీ–23, బైపీసీ–15, సీఈసీ–20 సీట్లు, గాంధారి బాలుర కాలేజీల్లో ఎంపీసీ– 05, బైపీసీ–10, సీఈసీ–15 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. భర్తీ కోసం 2022–2023 లో పదోతరగతి ఉత్తీర్ణులైన గిరిజన బాలబాలికలకు ప్రవేశాలు కల్పిస్తామన్నారు. విద్యార్థులు ఈనెల 29న ఉదయం 10.00 గంటలకు ఏకలవ్య కళాశాల గాంధారిలో హాజరు కావాలన్నారు. ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయం సర్టిఫికెటు, ఎస్సెస్సీ మార్కుల మెమో జిరాక్స్ కాపీలతో పాటు నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు.

పెద్ద నోట్ల మార్పిడి.. బ్యాంకులో ఖాతాదారుల బారులు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకులో మంగళవారం ఖాతాదారులు 2వేల రూపాయల నోట్ల మార్పిడి, వారి ఖాతాలో జమ చేసేందుకు బారులు తీరారు. రిజర్వు బ్యాంకు రూ. 2వేల నోట్లను బ్యాంకులో జమ చేసుకోవాలని, లేని పక్షంలో వాటిని మార్చుకోవాలని ఆదేశాలు జారీ చేయడంతో ఖాతాదారులు బ్యాంకులో రూ.2వేల నోట్లతో బారులు తీరారు.

ఆలయం కూల్చివేత ఘటనలో కేసు నమోదు

నవీపేట(బోధన్): మండలంలోని కోస్లి గ్రామ శివారులోని హనుమాన్ ఆలయాన్ని కూల్చివేసిన మొవ్వ నాగేశ్వరరావుపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై రాజారెడ్డి మంగళవారం తెలిపారు. నవీపేటకు చెందిన నాగేశ్వరరావుకు కోస్లి శివారులో వ్యవసాయ భూమి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ భూమి పక్కనే పురాతన హనుమాన్ మందిరం ఉందని పేర్కొన్నారు. ఎలికె ఫారం గ్రామానికి చెందిన తలారి అనిల్‌కుమార్ హనుమాన్ మందిరం రేకులషెడ్, ప్రహరీలను కొద్దికాలం కిందట నిర్మించారు. ఈక్రమంలో ఎలాంటి అనుమతులు లేకుండానే నాగేశ్వరరావు రేకులషెడ్డు, ప్రహరీని జేసీబీతో కూల్చివేయించారు. దీంతో హిందువుల మనోభావాలను దెబ్బతీసిన నాగేశ్వరరావుపై తలారి అనిల్‌కుమార్ ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం నాగేశ్వరరావుతోపాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

లక్ష్యం దిశగా ఆయిల్‌పామ్ సాగు!

- జిల్లాలో ఈఏడాది లక్ష్యం 8,100 ఎకరాలుగా నిర్ణయించిన అధికారులు
- ప్రస్తుతం 40వేల మొక్కలు సిద్ధం



నాగిరెడ్డిపేట మండలంలో సాగవుతున్న ఆయిల్‌పామ్ పంట

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా ఉద్యానశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. గతేడాది జిల్లాలో 800 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటను సాగు చేయగా.. ఈ ఏడాది సాగు విస్తీర్ణం లక్ష్యాన్ని 8,100 ఎకరాలకు పెంచారు. గతయేడు మాదిరిగానే ఈయేడు కూడా జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని నెరవేర్చేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. కానీ లక్ష్యానికి తగ్గట్టుగా పంటసాగు చేపట్టేందుకు సరిపడా మొక్కలు లేకపోవడంతో జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు విధించిన లక్ష్యాన్ని దశలవారీగా పూర్తిచేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈమేరకు ప్రణాళికలు రూపొందించారు.

గతేడాది వందశాతం లక్ష్యం పూర్తి...

జిల్లాలో ఆయిల్‌పామ్ పంట సాగులో గతయేడు విధించిన లక్ష్యాన్ని అధికారులు వందశాతం పూర్తిచేశారు. గతయేడు జిల్లాలో 800ఎకరాలలో ఆయిల్‌పామ్ పంటను సాగు చేయాలని లక్ష్యం విధించారు. ఈ మేరకు జిల్లాలో 251మంది రైతులను గుర్తించి వారికి సంబంధించిన భూములలో 800ఎకరాలలో ఆయిల్‌పామ్ మొక్కలను నాటించారు. ఈయేడు విధించిన లక్ష్యానికి తగ్గట్టుగా పంటను సాగు చేయించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

సాగుకు ప్రోత్సాహకాలు...

ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రైతులకు వివిధ రకాల ప్రోత్సాహకాలను అందిస్తుంది. ఇందులో భాగంగా ఒక మొక్క అసలు ధర రూ.213కాగా రైతు తన వంతుగా రూ.20చెల్లించాల్సి ఉంటుంది. మిగతా రూ.193 ప్రభుత్వమే చెల్లిస్తుంది. దీంతోపాటు ఆయిల్‌పామ్ మొక్కల నిర్వహణతోపాటు మొక్కల మధ్య అంతరపంట సాగు కోసం ప్రతియేడు ఎకరాకు రూ.4,200 చొప్పున నాలుగేళ్లపాటు అందించనున్నారు. దీంతోపాటు ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు 90శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలను అందించనున్నారు.

ఖరీఫ్‌లో 800 ఎకరాలకే..

జిల్లాలో 2023–24లో ఆయిల్‌పామ్ సాగుకు సంబంధించిన విధించిన లక్ష్యాన్ని నెరవేర్చేందుకు జిల్లా ఉద్యానశాఖ అధికారులు దశలవారీగా ప్రణాళిక రూపొందించారు. ఒకేసారి లక్ష్యానికి తగ్గట్టుగా పంటను సాగు చేయించేందుకు మొక్కలు అందుబాటులో లేకపోవడం వల్ల ప్రస్తుత ఖరీఫ్‌లో 8వందల ఎకరాలలో ఆయిల్‌పామ్ మొక్కలను నాటించాలని అధికారులు నిర్ణయించారు. ఎకరాకు 50మొక్కల చొప్పున నాటించనున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో 800 ఎకరాలలో ఆయిల్‌పామ్ పంటను సాగుచేయించేందుకు ఇప్పటివరకు 292మంది రైతులను సైతం గుర్తించారు. వచ్చే రబీసీజన్‌లో మిగతా లక్ష్యాన్ని పూర్తి చేయాలని అధికారులు భావించారు.

లక్ష్యాన్ని పూర్తి చేస్తాం..

ఈయేడు జిల్లాలో 8,100ఎకరాలలో ఆయిల్‌పామ్ పంటను సాగు చేయించాలని లక్ష్యంగా విధించాము. లక్ష్యానికి తగ్గట్టుగా పంటను సాగు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాము. ప్రస్తుతం ఖరీఫ్‌లో 800ఎకరాలలో ఆయిల్‌పామ్ మొక్కలను నాటిస్తాం. మిగతా లక్షాన్ని వచ్చే రబీలో పూర్తి చేస్తాము.

– విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి, కామారెడ్డి

కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి



సౌత్‌క్యాంపస్‌లో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు అధ్యాపకులు

భిక్కనూరు: రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్ కాంట్రాక్టు అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం వారు సౌత్‌క్యాంపస్‌లో ఒంటి కాలిపై అరగంట పాటు నిలబడి నిరసన తెలిపారు. 2015లో కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి, ఇప్పటి వరకు నెరవేర్చలేదని పేర్కొన్నారు. కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ కార్యవర్గసభ్యురాలు సునీతచ కాంట్రాక్టు అధ్యాపకులు డాక్టర్ నరసయ్య, శ్రీకాంత్, డాక్టర్ రమాదేవి, డాక్టర్ నిరంజన్, సరిత శ్రీకాంత్ దిలిప్ తదితరులు పాల్గొన్నారు.

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ఎదుట మంగళవారం కాంట్రాక్ట్ అధ్యాపకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

చిన్నారులతో భిక్షాటన చేస్తే చర్యలు



చిన్నారులతో భిక్షాటన చేస్తున్న వారిని సఖి సెంటర్‌కు తరలించిన అధికారులు

నిజామాబాద్ సిటీ: చిన్నపిల్లలను పట్టుకుని భిక్షాటన చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని బాల రక్షాభవన్ కోఆర్డినేటర్ విజయలక్ష్మీ తెలిపారు. నగరంలోని ప్రధాన కూడలిల వద్ద పసిపిల్లలను ఎత్తుకుని భిక్షాటన చేస్తున్న వారిని మంగళవారం విజయలక్ష్మీ గమనించారు. వెంటనే స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వారిని పట్టుకోవాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీను ఆదేశించారు. ఆమె ఆదేశాల మేరకు నగరంలో ప్రధాన కూడలిలో పసిపిల్లలను ఎత్తుకుని భిక్షాటన చేస్తున్న వారిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ పట్టుకుని సఖి సెంటర్‌కు తరలించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఇందల్వాయి: ఇందల్వాయి గ్రామ ఉన్నత పాఠశాలలో 2003–04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత మంగళవారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్నారు. ఈసందర్భంగా వారు అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని హాయిగా గడిపారు. అనంతరం తమకు చదువు చెప్పిన ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు.



ఉత్సాహంగా సీఎం కప్ క్రీడాపోటీలు



రన్నింగ్ చేస్తున్న క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: జిల్లాకేంద్రంలో సీఎం కప్ టోర్నీ క్రీడలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఎండలు మండిపోతున్నా.. క్రీడాకారులకు లెక్కచేయకుండా పోటీల్లో పాల్గొంటున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ స్విమ్మింగ్‌పూల్, రాజారాం స్టేడియంలో మంగళవారం పలు పోటీలు జరిగాయి. జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్న ఆధ్వర్యంలో పోటీలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ స్విమ్మింగ్‌పూల్ ఆవరణలో ఈత పోటీలు, కుస్తీ పోటీలు పురుషులు, మహిళలకు నిర్వహించారు. ఆఫీసర్‌క్లబ్‌లో షటిల్ బ్యాడ్మింటన్, రాజారాం స్టేడియంలో రన్నింగ్, తదితర పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపి విజేతలుగా నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. సీఎం కప్ టోర్నీ ముగింపు బుధవారం సాయంత్రం 4గంటలకు పోలీస్ పరేడ్ మైదానంలో జరుగనుంది. ఈసందర్భంగా విజేతలకు బహుమతులతో పాటు, నగదు ప్రోత్సాహం ఇవ్వనున్నారు.



ఈత పోటీల్లో గెలిచిన క్రీడాకారులు



కుస్తీ పోటీ విజేతలతో అధికారులు

వీఆర్‌ఏలను 'రెవెన్యూ'లోనే కొనసాగించాలి



సుభాష్‌నగర్: రెగ్యులర్ అయిన గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏ) అందరికీ పే స్కేల్ ఇచ్చి రెవెన్యూశాఖలోనే కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సీసీఎల్‌ఏ నవీన్ మిట్టల్‌ను రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. అంతకు ముందు వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేసినందుకుగాను ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ పుష్పగుచ్ఛం అందజేశారు. సీసీఎల్‌ఏను కలిసిన వారిలో రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి గౌతమ్, ట్రెసా జిల్లా అధ్యక్షుడు రమణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు బ్రాహ్మణపల్లికి మంత్రుల రాక

ఎడపల్లి(బోధన్): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో హనుమాన్ ఆలయ ప్రారంభోత్సవానికి బుధవారం దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, బోధన్ ఎమ్మెల్యే షకీల్‌అమీర్‌లు విచ్చేస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమాలకు సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

పోలీసులున్నా.. రోడ్డుపైనే తాగేస్తున్నారు..

నిజామాబాద్ నగరంలోని నిత్యం రద్దీగా ఉండే రైల్వేస్టేషన్ రోడ్డులో సోమవారం రాత్రి పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తూ.. చలాన్లు విధిస్తున్నారు. మరోపక్క అదే రోడ్డులోని వైన్స్ దుకాణం ఎదురుగా గల డివైడర్‌పై ఇద్దరు మందు బాబులు మద్యం తాగుతూ, దారిన పోయే ప్రజలకు ఇబ్బందులు కల్గిస్తున్నారు. పక్కనే పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా, మందుబాబులు మద్యం తాగడంపై పలు విమర్శలు చేస్తున్నారు. పోలీసులు వారిని పట్టించుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ –నిజామాబాద్



మతిస్థిమితం లేని యువకుడికి సపర్యలు



మతిస్థిమితంలేని యువకుడితో ఇందూరు యువత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

సిరికొండ: మండల కేంద్రంలో గత కొన్ని రోజులుగా నగ్నంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న యువకుడికి జిల్లా కేంద్రానికి చెందిన ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు సపర్యలు చేశారు. ఆ యువకుడి గురించి గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధి ధర్పల్లి బాబురావు ఇందూరు యువత స్వచ్ఛంద సంస్థకు సమాచారం ఇవ్వగా వారు మంగళవారం మండల కేంద్రానికి వచ్చారు. ఆ యువకుడికి గుండు చేయించి శుభ్రంగా స్నానం చేయించారు. కొత్త వస్త్రాలను ధరింప చేశారు. భోజనం పెట్టారు. సంస్థ అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు, సంస్థ ప్రతినిధులు రాహుల్, సచిన్, భాస్కర్, పోలీస్ కానిస్టేబుల్ శంకర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు



గాయపడిన సత్యనారాయణ

పిట్లం(జుక్కల్): మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామ శివారులో ధర్మారం టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి బైక్ అదుపుతప్పడంతో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. నిజాంసాగర్ మండలంలోని పారేడ్పల్లి గ్రామానికి చెందిన సత్యనారాయణ బైక్‌పై కౌలాస్ గ్రామానికి బయలుదేరాడు. టోల్ ప్లాజా వద్ద జాతీయ రహదారిపై అతడి బైక్ అదుపుతప్పడంతో కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో సత్యనారాయణకు తీవ్ర గాయాలు కావడంతో హైవే సిబ్బంది చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో పిట్లం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కుక్క దాడిలో బాలుడికి..



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడిపై ఓ కుక్క దాడి చేసి, గాయపర్చింది. వివరాలు ఇలా.. పట్టణంలోని అయ్యప్పనగర్‌కు చెందిన రఫిక్ మున్సిపల్‌శాఖలో విధులు నిర్వహిస్తుంటాడు. మంగళవారం అతని 11ఏళ్ల కుమారుడు రెహాన్ ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్క దాడి చేసింది. స్థానికులు కుక్కను కొట్టినా బాలున్ని వదలలేదు. దీంతో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం స్థానికులు బాలుడిని ఏరియా ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించారు. కాలనీలో పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తున్నాయని చిన్నారులపై తరుచూ దాడులు చేస్తున్నాయని కాలనీవాసులు వాపోయారు. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

అగ్ని ప్రమాదంలో ట్రాక్టర్ ట్రాలీ, గడ్డి దగ్ధం

ఇందల్వాయి: మండలంలోని సిర్నాపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో చాకలి బక్కన్న అనే రైతుకు చెందిన సుమారు 300 గడ్డి కట్టలు, పక్కనే నిలిపి ఉంచిన ట్రాక్టర్ ట్రాలీ దగ్ధమైంది. పంట పొలాల్లో పెట్టిన నిప్పు గాలితో వేగంగా పశువుల కొట్టం వైపు వచ్చి ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. గన్నారం అగ్ని మాపక కేంద్రానికి సమాచారం అందించగా సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

రుద్రూర్: మోస్రా మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. బోధన్ మండలం ఊట్పల్లి గ్రామానికి చెందిన వీరేశం (40) టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తుండగా టిప్పర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే క్షతగాత్రున్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

పది రోజుల్లో కూతురి పెళ్లి..

- పెళ్లి సామానుకు వెళ్లిన తండ్రి గుండెపోటుతో మృతి
- నారాయణగూడ తండాలో విషాదం



లచ్చిరాం (ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): పది రోజుల్లో కూతురు పెళ్లి ఉండగా, పెళ్లి సామాను కోసం వెళ్లిన తండ్రి గుండె పోటుతో మృతిచెందడంతో మండలంలోని నారాయణగూడ తండాలో విషాదం నెలకొంది. తండావాసులు తెలిపారు వివరాలు ఇలా.. తండాకు చెందిన బుక్యా లచ్చిరాం (45), బుజ్జి దంపతులకు ము గ్గురు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు సంతానం. కాగా ఇద్దరు కుమారులు జగన్(10), శివ(8) గత రెండు సంవత్సరాల క్రితం అటవీశాఖ వారు తవ్విన కందకాల్లో పడి మృతి చెందారు. ఆ ఘటన నుంచి కోలుకునే సమయంలో కుటుంబంలో మరో విషాదం చోటుచేసుకుంది. జూన్ 3న పెద్ద కూతురు కల్యాణి వివాహం నిశ్చయించారు. పెళ్లి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో లచ్చిరాం మంగళవారం గాంధారి మండల కేంద్రానికి పెళ్లి సామానుకు వెళ్లాడు. పెళ్లి సామగ్రి తీసుకుందామని బైకు ఆపాడు. అదే సమయంలో గుండెపోటు వచ్చింది. వెంటనే స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. లచ్చిరాం మృతితో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. కొద్ది రోజుల్లో కూతురి పెళ్లి ఉండగా, తండ్రి మృతిచెందడంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. తండావాసులు సైతం కంటతడి పెట్టారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి






ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలోని డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ దగ్గరలో మంగళవారం జరిగిన రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి(25) మృతి చెందినట్లు ఎస్సై ప్రణయ్ తెలిపారు. మృతుడి వివరాల కోసం రైల్వే పోలీసులను ఆశ్రయించాలని తెలిపారు. శవాన్ని జీజీహెచ్‌కు తరలించినట్లు చెప్పారు.

కామారెడ్డి మండలంలో..

కామారెడ్డి క్రైం: కామారెడ్డి నుంచి తలమడ్ల వెళ్లే దారిలో మంగళవారం రైల్వే పట్టాలపై ఓ గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మంగళవారం ఘటనా స్థలంలో మృతదేహాన్ని స్థానికులు గమనించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై తావునాయక్, సిబ్బంది అక్కడకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి, విచారణ జరిపారు. మృతుడు గుర్తు తెలియని రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. అతడు సుమారు 25–30ఏళ్ల వయస్సు ఉంటాడని ఎస్సై తెలిపారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదు. మృతుని మెడపై ఓం గుర్తు, ఎడమ చేతిపై శ్రావణి అనే టాటూలు ఉన్నాయన్నారు. ఎవరైనా అతడిని గుర్తుపడితే కామారెడ్డి రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో 8 గేదెలు మృతి



గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రం సమీపంలోని గాంధారి–చద్మల్ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో 8గేదెలు మృతిచెందాయి. గేదెలు రోడ్డుపై వెళుతుండగా వాటిని గుర్తు తెలియని వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎనిమిది గేదెలు మృతి చెందాయి. గేదెల మృతదేహాలు రోడ్డుపై, రోడ్డు పక్కన చెల్లాచెదురుగా పడిపోయాయి. గేదెలు నేరల్ తండా రైతులకు చెందినవిగ గుర్తించారు.

విద్యుత్ షాక్‌తో గేదె..



ఇందల్వాయి: ఇందల్వాయి మండలం మేఘ్యానాయక్ తండాలో పూర్యానాయక్ అనే పాడి రైతుకి చెందిన గేదె విద్యుత్ షాక్‌తో మంగళవారం మృతి చెందింది. పొలంలో మేతకు వెళ్లిన గేదె, 11కేవీ వైరు తెగిపడి ఉండటంతో షాక్ తగిలి మృతి చెందిందని బాధితుడు తెలిపాడు. వైరు తెగిపోయిన విషయం విద్యుత్ అధికారులకు సమాచారం అందించినా.. వారుసకాలంలో స్పందించలేదని, తమ గేదె మృతికి విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని బాధితుడు ఆరోపించాడు. మృతిచెందిన గేదె విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని, నష్ట పరిహారం అందించాలని బాధితుడు డిమాండ్ చేశాడు.

మహారాష్ట్ర మద్యం పట్టివేత



రెంజల్(బోధన్): మండలంలోని కందకుర్తి శివారులో గల అంతర్రాష్ట్ర వంతెన వద్ద మంగళవారం మహారాష్ట్ర మద్యం తీసుకువస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రూప్‌సింగ్ తెలిపారు. కందకుర్తి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా కందకుర్తి గ్రామానికి చెందిన నరేష్ అనే యువకుడు ఆటోలో పక్కనే గల మహారాష్ట్ర నుంచి అక్రమంగా మద్యం తీసుకువస్తుండగా పట్టుకున్నట్లు వివరించారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

జొన్నలాప తిని 60 పశువులకు అస్వస్థత

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని వన్నెల్ గ్రామంలో మంగళవారం జొన్న చేనులో పెరిగిన లాప తినడం వల్ల 60 పశువులు అస్వస్థతకు గురయ్యాయి. వెంటనే ఎంపీపీ సంతోష్ రెడ్డి, సర్పంచ్ కృష్ణారెడ్డిలు పశువైద్యాధికారికి సమాచారం అందించారు. వెంటనే డాక్టర్లు గ్రామానికి చేరుకొని చికిత్స చేయగా అవి కోలుకుంటున్నాయి. ఒక్క గేదె చనిపోయింది. సమయానికి పశువైద్యాధికారులు స్పందించడంతో పశువులు కోలుకుంటున్నాయి. గ్రామస్తులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.